సృష్టికే అందం



ముక్కింది. మూల్గింది. ముందుకు సాగినట్లు సాగింది. ఆగినట్లు ఆగింది.

ఆగిందనుకొనేసరికి ఆర్భాటాలు చేస్తూ ఆవేశపడింది. ఆవేశంలో ఎగిరెగిరి పడింది. ఎత్తెత్తివేసింది. కాసేపు కళ్ళెంలేని గుర్రంలా పరుగులు తీసింది. కాసేపు నత్తలా మెత్తగా సాగింది. గంటలోపుగా ఇన్ని విపరీతపు చేష్టలు ఇష్టమొచ్చినట్లు ప్రదర్శించి 'ఇక చాలురా బాబూ!?' అనుకొనేసరికి స్తబ్దంగా నిలబడిపోయింది!

తిరుపతి నుండి బయలుదేరిన ఆర్టీసీ బస్సు శ్రీ కాళహస్తిలో నిలబడింది.

నిలబడిన బస్సు నుండి లేచి నిలబడ్డాను. 'కుయ్! కయ్!' మంటున్న సోడా అరుపులు, రిక్షాల పలకరింపులు, చక్కెర అరటిపండ్ల రేట్ల వివరాలు.... నిలబడిన బస్సును నిలువునా ముంచివేస్తున్నాయి. గూబలను గుయ్ మనిపిస్తున్నాయి. చుక్క వేసిన ఓ ఆసామి సగం కొరికిన చక్కెరటి పండునొకటి చేతబట్టుకొని, బస్సు ప్రదక్షిణం చేస్తున్నాడు. ఎందుకో? ఏమో?.... పాపం! వినబడీ వినబడనట్లు గొణుక్కోవడం, వికృతంగా చూడడం, కాసేపు వేగంగా, కాసేపు ఊగుతూ నడవడం, నిలవలేక నిలవలేక నిలబడడం—అతని చేష్టలన్నీ ఆర్టీసీ బస్సును మతికి తెస్తున్నాయి. తాగినవాడికి, ఆర్టీసీ బస్సుకు సమన్వయం కుదిరేసరికి నాలో నేను సన్నగా నవ్వుకొన్నాను. అంతవరకు ఎదురుసీట్లో ఒదిగి కూర్చొన్న ఓ సన్నజాజి బస్సు ఆగేసరికి అందరితో కలసి లేచి నిలబడింది. తొక్కుకొని తోసుకొని నలగడానికి ఇష్టపడనట్లుగ అందమైన మొహాన్ని ఆరువంకర్లు తిప్పింది. చుక్కేసిన చక్కెరటిపండు కంటపడి, ఆర్టీసీ బస్సు అవతారంతో సమన్వయాన్ని కుదుర్చుకొని, సన్నటి నవ్వు నా పెదవులపై విరబూస్తే విరబూయడం 'సన్నజాజికే' పరిమితమైన హక్కనుకొని, ఆ హక్కేమో దురాక్రమణయినట్లు భావించి, పాపం! సన్నజాజి కొరకొర చూసింది.

"ఏమయ్యా? కళ్ళు కనబడడంలేదా? ఒళ్ళు చెప్పినమాట వినడంలేదా? ఎందుకలా పైబడతావు? ఏం కొంపలు మునుగుతున్నాయని ఆ తొందర?" తన తొందరపాటును గ్రహించలేని ఓ భద్ర మహిళ పైన పడబోయిన ఒక వ్యక్తిపై విరుచుకుపడింది.

"తల్లీ! ఆ మాట నన్నడిగితే లాభమేమి? ఇంతదూరం వచ్చి ఇప్పుడిక యోచనేమి? నన్ను ముందుకు నెట్టుతున్న నా వెనుకనున్న గుంపు నడుగు. ఇంతమందిని ఉప్పుమూటల్లా ఈ బస్సులో కుక్కిన ఆర్టీసీ అధినేతల్నడుగు!"

నాటకానుభవం పుంజగా వున్నట్లుందా పెద్దమనిషికి.

బస్సు గలగల మంది మళ్ళీ కదలడానికేమో?

"హోల్డాన్! హోల్డాన్!" కండక్టరు అరుస్తున్నాడు.

ఆ వ్యక్తి ఆగేటట్లులేదు.

"అక్కడ—ఆ సభల్లోనేం వో ...'హక్కులు, హక్కులు!' అని గొంతు చించుకొని ఎవరో ముందుకు పోనీయకుండా పగ్గాలేసి పట్టినట్లు పరితపించి, ఇక్కడ ముందు పడడానికి ముక్కితే ఎట్లాగండీ?" ఖద్దరు ఖండువా సర్దుకోవడం, తన మాటలు నలుగురు వింటున్నారా—లేదా? అని దిక్కులు పరికించడం అతని ధోరణి అతనిదిగా వుంది.

ఈమారు సన్నజాజి కూడా సన్నగా నవ్వింది.

'బ్రతుకుజీవుడా!' అని బయటపడ్డాను.

నాలుగుచక్రాల బండ్లమీద బద్దలుగా కోసివుంచిన పుచ్చపండ్లపై ఈగలు పిచ్చిగా ముసురుతున్నాయి. వేసవికాలానికి స్వాగతం చెబుతూ వడ గాడ్పులు విసురుతున్నాయి. రిక్షావాండ్లు 'రిక్షాసార్ రిక్షాసార్' అంటూ నన్ను ముసురుకొన్నారు. కర్రకు గట్టిన గుడ్డతో కరిబూజ పండ్లపై వాలుతున్న ఈగలను తరిమినట్లు, వట్టివేళ్ళ విసనకర్రతో వడగాల్పులను మందలించి నట్లు, చేతిరుమాలు ఆయుధంగా అలనాటి అభిమన్యుడిలా రిక్షావాళ్ళ పద్మ వ్యూహాన్ని ఛేదించుకొని బయటపడ్డాను.

ఒక్కక్షణం నిలబడ్డాను. కదలిపోతున్న ఆర్టీసీ బస్సును చూశాను. కంటబడని సన్నజాజికై కలయచూశాను. నిరాశను కళ్ళలో నింపుకొంటున్న రిక్షావాళ్ళను చూశాను. మహిళా ప్రగతి నినాదాలకు క్రొంగొత్త అర్థాలు తీసిన ఖద్దరు కండువాను చూశాను. పొద్దువాలి, స్వర్ణముఖి నది తెల్లటి యిసుకపై తేలి ఊరిమీద పడి, బంగారు కాంతుల్ని చల్లుతున్న సంజ

వెలుగుల్ని చూశాను. ప్రకృతి పారబోస్తున్న అందచందాలు తికమక పడుతున్నాయి—తీరిక, ఓపికలేని మానవాళి దృష్టిని ఆకట్టుకోలేక! అయితే, నా దృష్టిని ఆకట్టుకొన్నది మాత్రం ఒక రిక్షావాడు.

రిక్షాల గుంపునుండి వెలివేసినట్టు ఆ మలుపులో కాస్త దూరంగా వున్నారు వాడూ, వాడి రిక్షా! ఆ రిక్షా వాడి బ్రతుకుకాధారం. ఎండలోకానీ, వానలో కానీ కాస్త సందు దొరికితే ఆ ఎముకల గూడు సేద దీర్చుకోవడానికి ఆశ్రయం. అందుకేనేమో? రెండు మోచేతుల్ని హేండిల్‌బార్‌పై ఊనుకొని ఎటో చూస్తున్నాడు.

సగం అల్లి వదలిన పిచ్చుక గూడులా వుంది గడ్డం. కలిగిన మహానుభావుడెవరో ఏవగించుకొని ఎటో విసిరిన కుళ్ళాయి వాడి తలమీద పడి సగర్వంగా వుంది—జన్మసార్థకత చెందినట్లు. 'నేనే అడ్డమే లేకుంటే ఎవరైనా లెక్క పెట్టవచ్చు నీ ఎముకల్ని అని మురిసిపడుతూ వుంది చిరిగిన చొక్కా. పండ్ల మధ్య బిగిసిన తుండుబీడీ కాలి కాలి ఎప్పుడారిపోయిందో నుసి రాలుతూ వుంది. కానీ కండ్లు మాత్రం దీగూట్లో దివ్వెల్లా వెలుగుతున్నాయి. ఎటో చూస్తున్నాడు. ఏమిటో ఆలోచిస్తున్నాడు.

బస్సు ఆగింది. ప్రయాణీకులు ఎక్కారు. దిగారు. వ్యాపారులు అరుపులందుకొన్నారు. రిక్షావాండ్లు గోలచేశారు. తప్పించుకొని బయట పడితే చాలునన్న స్థితిని కల్పించారు. ఉన్నట్లుండి ఓ జాతరంత రభస జరిగినా తనకేమీ పట్టనట్లుగా వున్న ఆ రిక్షావాడిని చూస్తుంటే యెందుకో ఓ రకమైన అభిమానం కలిగింది వాడిమీద. అది సహజంకూడానేమో? అందుకే అందరినీ వదలి వాడిని సమీపించాడు.

"ఏయ్.... రిక్షా!"

వాడికి తనదంటూ ఒక రిక్షా వుండదు. కానీ, తనదైనా తనదికాని ఊరు

ఉంటుంది. తలిదండ్రులు అల్లారు ముద్దుగా పెట్టుకొన్న పేరు వుంటుంది. అయినా, వాడిపేరే 'ఏయ్! రిక్షా!'

గుమస్తాను 'గుమస్తా' అని పిలిస్తే బాధ. డాక్టర్ని 'డాక్టర్' అని పిలవకపోతే బాధ. జానెడు పొట్టకోసం బ్రతుకుతున్న వాడికి మానెడు ఆలోచనలుండవు. ఉండడానికి వీలులేదు. అందుకే వాడేమీ అనలేదు. అయితే, నోట్లోని తుండుబీడి తటాలున చేతికి వచ్చింది. ఆపై కాలికింద పడి నలిగిపోయింది. వాడు నిటారుగా నిలబడి రిక్షా కదలించడానికి ముంపుతూ "ఎక్కడికి బాబూ!" అన్నాడు.

వీళ్ళతో పేచీపడడం మహాకష్టం కాబట్టి ముందే అడిగాను.

"ఎంతేఁవుంది? ముప్పయి పయిసలు."

ఎక్కడికని వాడు అడగనూలేదు, నేను చెప్పనూలేదు. అయితే మాత్రం ముప్పయి పైసలన్నాడు. అందుకే వాడివైపు ప్రశ్నార్థకంగా చూశాను. వాడు గ్రహించినట్లుంది.

"ఇంకే ఊళ్ళోనైనా అయితే ఏఁవోగానీ—ఈ ఊళ్ళో యాడెక్కి, యాడ దిగినా ముప్పయి పైసలే! ఎక్కండి బాబూ!!" నా సందేహాన్ని తీర్చాడు.

"చాలా చవకే!" అందామనుకొన్నా, స్వార్థం గొంతు పెగలనివ్వలేదు.

ఎక్కి కూర్చున్నాను. వాడు ఒక్క ముంపుతో రిక్షా ముందుకు నెట్టి, ఆపై ఎగిరి కూర్చుని తొక్కుతున్నాడు.

రిక్షా పోతూవుంది. తూర్పుగాలి తెంపులు తెంపులుగా వస్తూవుంది. వాడు ముందు. నేను వెనుక. వాడు సీటుమీద నుండి బెత్తెడు పైకిలేచి ఊపిరి ఉగ్గబట్టి తొక్కుతున్నాడు. తొక్కడం వాడి ధ్యేయం. అయితే

వాడితో ప్రమేయం లేకుండా చెమట కారి, చిరిగిన చొక్కాను తడుపుతూ వుంది. దీనితో ప్రమేయం లేకుండా నేనేమో నడుము వాల్చి కూర్చున్నాను. అయితే, నాకే కాస్త యిబ్బందిగా వుంది—చెమటకంపును మోసుకొస్తున్న తూర్పుగాలిని భరించడం. ఓపికపట్టి కూర్చున్నాను. వాడితో మాట్లాడాలన్న కుతూహలాన్ని అణచుకోలేకపోతున్నాను.

"చూడబ్బీ! బస్సు వచ్చింది. ఎంతోమంది దిగారు. ఆ మలుపులోని రిక్షావాండ్లు దాదాపు బస్సును చుట్టుముట్టేసినారు. మరి నువ్వేమో?....నన్ను ముట్టుకోకన్నట్లుగా యెందుకలా దూరంగా నిలబడిపోయావు?"

రిక్షా తొక్కుతూనే ఒక్కసారి వెనక్కు తిరిగి, అదోరకంగా చూచి, ఇంకోరకంగా నవ్వి, యథాప్రకారం రిక్షా తొక్కుతున్నాడు వాడు. వాడి ధోరణి నాలో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించింది.

"ఎందుకలా నవ్వుతున్నావు?"

"బాబూ! మీరూ మనిషే! నేనూ మనిషే!" వాడు చాల వినయంగా అంటున్నా చెంపన 'ఛెళ్ళున' కొట్టినట్లయింది. నిబ్బరించుకొన్నాను.

"అయితే?"

"అయితే మీరు కూర్చున్నారు. నేను తొక్కుతున్నాను. అంతేతేడా! దీన్ని తలరాతన్నారు మీబోటి పెద్దోళ్ళు!" తల దిమ్మెక్కింది.

"నే నడిగిందేమిటి? నువ్వు చెబుతున్నదేమిటి!"

"మీ రడిగింది, నేను చెప్పింది రెండూ ఒకటే బాబూ!"

"అదెలా?"

"అంటే ఎవరి అదృష్టం వాళ్ళదని బాబూ!"

"ఆహా(!"

"అంతేగదా బాబూ! బస్సు వచ్చి రావడంతోటే అందరూ ఈగల్లా ముసురుకున్రని. అయితే అందరికీ బాడిగ దొరికిందా? లేదే....! మరి నాకో? హ్హహ్హహ్హ: దీన్నేనేమో బాబూ తలరాతనేది!"

మనిషి పెళుసుగా కనిపించినా మాట దురుసుగా వుంది. దురుసంటే అలా యిలా కాదు. ఏకంగా గుండెల్ని ఒరుసుకుపోయే దురుసు. వాడికీ పరిజ్ఞానం జీవితానుభవంతో అబ్బిందా? లేక వున్నవాళ్ళు లేనివాళ్ళ నెత్తిన యుగయుగాలుగా ఈ వేదాంతాన్ని రుద్దుతున్నారా? అర్థంగాక ఆలోచిస్తున్నాను.

"చూడండి బాబూ! బుద్ధిలేనోళ్ళెవురో బుద్ధిలేకుండా కలిసి బతికితే నేను పుట్టుంటాను. బుద్దెరగనినాటి కత ఏఁవిటో కానీ—బుద్ధి తెలిసింది మొదలు బుద్ధిగా బతకాలనుకొన్నాను. మూటలు మోశాను. చెన్నపట్నంలో సవారిబండి లాగాను. ఇప్పుడీ ఊళ్ళో రిక్షా తొక్కుతున్నాను. నిన్న మొన్నటినుండి కాదు, ఇరవై ఏండ్లుగా. ఎంత తొక్కినా బతుకులో తొక్కుళ్ళు పడలేకుండా వున్నాను. కానీ, బాబూ! ఈ ఇరవై ఏండ్లలో నేను చూస్తా వుండగానే గుడిసెలు మిద్దెలైనాయి. మిద్దెలు మేడలైనాయి. నా బండిలో తిరిగినవాళ్ళు వా బండిలో అప్పుడు కాలు మోపలేనోళ్ళు కార్లల్లో తిరుగుతుండారు. దీన్నేఁవంటారు?"

"తలరాతా లేదు. గిలరాతా లేదు. తనచేత తనరాత! కష్టపడ్డవాడికి కష్టపడ్డంత!"

ఉన్నట్లుండి నిలిపాడు రిక్షా. కొాస్త ఎక్కుడుగా వుంది. వాడు గసపోస్తూండడము చూసి తొక్కలేకనేమో! అనుకొన్నా. కానీ గబాలున దిగాడు. నావైపు తిరిగాడు. కుడిచేయి చూపుడువ్రేళ్ళతో నొసట దట్టంగా పట్టిన చెమట నూడ్చుకొన్నాడు. ఆ వ్రేలిమీదుగా చెమటను బొట్లుబొట్లుగా రాలుస్తూ—

"ఇది కష్టంగాదా బాబూ!" అన్నాడు.

సమాధానం గొంతులో సతమతమయింది. కనుకొలకులు చెమ్మగిల్లాయి.

ఆ తరువాత మా ఇద్దరిమధ్య మాటలులేవు.

బస్టాండులో బయలుదేరిన రిక్షా మెయిన్‌రోడ్ మీదుగా సాగి ఒక కూడలివద్ద ఆగింది.

"ఎటు వెళ్ళమంటారు, బాబూ!" అప్పుడడిగాడు వాడు.

"తాలూకాఫీసుకు వెళ్ళు!" అన్నాను.

రిక్షా పోతూవుంది. ఒక్కరిక్షా మాత్రమేనా? రిక్షాతో కలిసి లోకమే పోతున్నట్లుంది. ఎవరిదారి వారిదిగా. ఎవరి బ్రతుకులు వారివిగా. అప్పుడు లోకాన్ని చూచే శక్తి లోపించింది నాలో. రిక్షావాడివైపే చూస్తున్నాను. తూర్పుగాలి ఎటు కొట్టుకుపోయిందో తెలియడంలేదు. వాడి వేషానికీ, భాషకు, భాషకూ భావానికీ ఆమడల దూరముందే? జీవితావగాహన శక్తి ఇంకనూ పైనుందే! అని ఆలోచిస్తున్నాను.

రిక్షా తాలుకాఫీసు ముందాగింది.

రిక్షా ఆపుచేసి వాడు దిగాడు. నేనూ దిగాను. దిగుతూనే వాడు మళ్ళీ కుడిచేతి చూపుడువ్రేలితో నొసటపట్టిన చెమట తుడుచుకొన్నాడు. చూపుడు వ్రేలిమీదుగా ఆ చెమట ఒక్కొక్క బొట్టుగా నేలరాలుతూ వుంది. ఒక్కొక్క బొట్టు వేయిగొంతుకలై 'ఇది కష్టంకాదా? ఇది కష్టంకాదా?' అని ప్రశ్నిస్తున్నాయి. ఈ సారి మాత్రం వాడు నావైపు చూడడమేలేదు. చిరిగిన ఆ చొక్కానే కాస్త పైకిలాగి వదులు చేసుకొని ఒంటిమీద పట్టిన చెమటను తుడుచుకొంటున్నాడు. వాడిని చూడలేక పక్కకు తిరిగాను. జేబులో చేయి వేశాను. ఉన్నది ఒక్క పదిరూపాయల నోటు—అదే చేతికి తగిలింది. తీసి వాడి చేతికిచ్చాను. సందేహిస్తూ తీసుకొన్నాడు. చుట్టుప్రక్కల కలయ చూశాడు. అటుపై తెపరాయించుకున్నాడు. రిక్షా సీటును సమీపించాడు. నేను ఆశ్చర్యంగా అటువైపే చూస్తున్నాను.

రిక్షాసీటుకు రెండుసార్లు చేయెత్తి మొక్కాడు. అటుపై సీటుమధ్య భాగాన కాన్వాసు క్రింప దాచిన పైకాన్ని బయటికి తీశాడు. నాకు ఆశ్చర్యమేసింది. అదెలా సాధ్యపడిందని పరిశీలించి చూద్దునుగదా? సీటు మధ్య భాగాన కాన్వాసుకు మూడంగుళాల వెడల్పు కాజేసి వుంచాడు. దానిమీద కూర్చుంటే కాన్వాసుమీద కాటున్నట్లే తెలియదు. పరిశీలించి చూచి ఆ సందును వెదకి పట్టుకొని అందులో పైకం దాచడమో, తీయడమో చేయాలి. నిక్కరు జేబులు రెండు, చిరిగిన చొక్కాకొక జేబువుండి కూడా వాడి వైఖరి నాకు లేని కుతూహలాన్ని కలిగించింది.

"ఇంకెక్కడ చోటులేనట్లు కూర్చునే సీటుకింద దాచావేం డబ్బును?"

"ఏం జెయ్యమంటారు బాబూ! ఇదేం నా సొంతబండి కాకపోయే. పూటకు మూడు రూపాయలు వంతన బాడిగ కట్టాల. లేకుంటే ఓనరు మక్కెలిరగదంతాడు. లేదా బండక్కడే పెట్టు అంటాడు. ఈ పూటతో బాడిగట్టి మూన్నాళ్ళయింది. ఇంట్లో ఆడది ముద్ద ముట్టి మూన్నాళ్ళయింది. ఎక్కణ్నుంచి వచ్చిందో మాయదారి రోగం—మాలాంటి పేదోళ్ళ బదుకుల్లోనే రావాలా? డాక్టరుబాబుకు పదికట్టాల. మూన్నాళ్ళ నుండి ఆ పదికోసం కన్నగసాట్లు పడతావుండా! ఏం చెయ్యమంటారు చెప్పండి. పైసా పైసా కూడేస్తే కూడా పది కానంటూంది. ఈ లోపుగ ఓనరు కంట్లో పడితే పోలీసోళ్ళు దొంగను నోదాచేసినట్లు చేస్తాడు. అందుకే బాబూ ఈ దొంగ సచ్చిన యవ్వారం!" వాడి గొంతు రుద్ధమైపోయింది. వాడి ఆవేదనలో అభిమానం కొట్టవచ్చినట్లు కనుపించింది.

బాధ్యత ఒక్కొక్కసారి మనిషిని ఎలా తప్పుదారి పట్టిస్తుందో ఆలోచిస్తున్నాను.

ఇంతలో ఆఫీసులో పనిచేస్తున్న మిత్రుడొకడు కనిపించడం, కుశల ప్రశ్నలు కురిపించడం, ఆ ముందు ముందటి రోజు నా బుర్రకథా ప్రదర్శన

ప్రసక్తితో మురిపించడం, అప్పటి నా మనోస్థితిని పూర్తిగా మరపించడం జరిగితే—రిక్షావాడు చేతికిచ్చిన డబ్బును చేతనే పుచ్చుకొని ఆ మిత్రునితో కలిసి మాట్లాడుతూ ఆఫీసులోనికి వెళ్ళాను. ఏదో పర్మిట్టుకు సంబంధించిన వ్యవహారం. గంట వ్యవధిలోపలే ముగిసింది. పని ముగించుకొని బయట పడ్డాను. అప్పటికికానీ రిక్షావాడు వాపసు యిచ్చిన చిల్లరడబ్బు సంగతి మతికి రాలేదు. లెక్కపెట్టి చూద్దునుగదా? సరిగ్గా తొమ్మిది రూపాయలే వున్నాయి. అంటే ఒక్కరూపాయి కొట్టేశాడన్న మాట. మనస్సు చివుక్కుమనింది. మనుష్యుల మీదనే అసహ్యం కలుగుతూవుంది. డెబ్బయిపైసలు పోయాయని కాదు. మనిషి మాటకు - చేతకు సామ్యమే లేకుండాపోతూందే ఈ కాలంలో అని!

వద్దనుకొనే కొద్దీ అదే ఆలోచన. 'ఔరా! రిక్షావాలా! ఎంత చక్కగా నటించావురా? అందరూ 'రిక్షా! రిక్షా!' అని పైపై బడుతూంటే నువ్వు పట్టించుకోకుండా దూరంగా కూర్చున్నావే? అని అడిగితే అదృష్టాదృష్టాల ప్రసక్తితో నోరుమూయించి కోరికలకే అతీతుడైనట్లు మాట్లాడావుగదరా! 'ఎంత యిమ్మంటావురా?' అంటే 'ఈ ఊళ్ళో ఎక్కదెక్కి మరెక్కడ దిగినా ముప్పయి పైసలే సామీ!' అని ముంగాళ్ళకు బంధమేశావు గదరా! దాని తాడుదెగ కర్మ సిద్ధాంతమే తారుమారయిపోయినట్లు ఎంత చక్కగా నాటకమాడావురా! రోగమంటివి. డాక్టరంటివి. ఓనరుకి భయపడి డబ్బు దాస్తున్నానంటివి. నీ మాటలు....మాటలకు తగిన చేతలతో మనస్సే కరిగి పోయెగదరా! ఒరే మేధావీ! ఎంతటి అనుభవాన్ని గడించావురా పెట్టుబడిగా మోసానికి?' ఆలోచించే కొద్దీ బీరకాయ పీచులా ఆలోచనలు సాగుతూనే వున్నాయి. రిక్షా మాటంటేనే అసహ్యంగా వుంది. అందుకే నడుస్తున్నాను. 'బస్సుస్టాండు ఎప్పుడు చేరుతామా?' అన్న ఆతురతతో వంచిన తల ఎత్తకుండా నడుస్తున్నాను.

'బాబూ! బాబూ.' అన్న అరుపు, ఆ అరుపును వెంబడిస్తూ రిక్షా

గంట వున్నట్లుండి చెవినిపడ్డాయి. ఆ గొంతు పరిచితమైనదని తోస్తున్నా, యింకనూ భ్రమలోపడి కొట్టుకపోవడం యిష్టంలేక నడుస్తున్నాను.

"బాబూ! మిమ్మల్నేబాబూ! మిమ్మల్నే" ఆ అరుపు దగ్గరవుతూ వుంది. అనుకోకుండానే తిరిగి చూశాను.

ఆశ్చర్యం. వాడే! ఆ రిక్షావాడు!!

రొప్పుతూ రోజుతూ రిక్షా తొక్కుకొంటూ వచ్చి నాముందు రిక్షా ఆపాడు. రిక్షానుండి ఒక్కసారిగా కాళ్ళపై పడబోయినంతపని చేశాడు, 'మన్నించండి బాబూ' అంటూ.

మాటలూచేతలుడిగి వాడి వైపే చూస్తూ నిలబడ్డాను. నా వైపు చూడలేనట్లుగ తల వంచుకొన్నాడు. గస ఎగ్గొట్టుక వస్తూ వుంది. నా ఎదురుగా వాడు. వాడి ఎదురుగా నేను. రెండు నిముషాలు మా ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది. మెల్లగా తల పైకెత్తాడు వాడు. వాడి మొగాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. కన్నీళ్ళను ఆపుకొనడానికి ఎంతో ప్రయత్నిస్తున్నాడు వాడు.

"బాబూ! పది రూపాయలు కంటబడడంతో ఒళ్ళు మరిచిపోతి. మంచానికి కరిచకపోయిన పెళ్ళాం. పది రూపాయలు లేకుంటే మందేలేదని యిరచకపడిన డాక్టరుబాబు—కండ్లముందు మెదిలి కండ్లు బూసులుకమ్మె! ఎప్పుడో నిన్నియ్యెరవకాడ తాగిన దోసెడు సద్దినీళ్ళు. మీకెం తెచ్చినానో? యేంవో కూడ సూసుకోకుండా పరిగెత్తితి. డాక్టరు బాబు కాళ్ళమీద పడితి. మారాజిచ్చిన ఆ మందు పెళ్ళాం గొంతులో పోస్తి. మీరే సెప్పండి బాబూ! నమ్ముకున్న ఆడది. దానికి నేను. నాకు అది. అప్పటికి నిమ్మళించింది నా మణుసు. లెక్క జూసుకుంటే మీకు సిల్లర డబ్బు వాపసియ్యలేదని తేలింది. అంతే! పరుగో పరుగు—తాలూకాఫీసుకుపోతి. అక్కడ లేడన్రి. ఊరు మూడు చుట్లేసుకొని వస్తుండా! సత్తింగా—నా ఆడదానితోడు. దోవలో

రెండు మూడు బాడిగలొస్తే కూడా వదులుకోనొస్తుండా! మన్నించండి బాబూ!" అని అమాంతంగా కాళ్ళమీద పడబోయాడు.

ఆ పని చేయవలసింది వాడా? నేనా?

నిజంగా నేనైతేకూడా ఆ పని చేయడానికి అంతస్థు అడ్డుపడింది. 'ఆత్మ సౌందర్యం లేని నీ అంతస్థులు కాల్చనా?' అని మనస్సు వికలమయితే తల వాలిపోయింది, వాడిని సూటిగా చూడలేక!

"ఫరవాలేదులే! ఆ చిల్లర డబ్బులు నువ్వే తీసుకో!" అన్నాను.

"వద్దు బాబూ! వద్దు. సెఁవటోడిస్తేనే సేతికి దక్కేది అంతంత మాత్రంగా వుంటే ఇంకివన్నీ ఎందుకు, బాబూ!" అంటూ ఆ చిల్లర డబ్బులు—అదే డెబ్బయి పైసలు నాచేత పెట్టాడు.

ఒకసారి వాడివైపు చూశాను. మరొక్కసారి చుట్టూ కలయ చూశాను. కొండల వెనుక పడబోతున్న సూర్యుడు పడమటి దిక్కును అరుణ రాగరంజితం చేస్తున్నాడు. స్వర్ణముఖినది గట్టున పార్కులో నెమలి పురి విప్పి ఆడుతూ వుంది. పూబాలలు గాలి తాకిడికి ముద్దులు పోతు న్నాయి. స్వర్ణముఖి నదిలో అక్కడక్కడ గుంతల్లో నిలిచిన నీళ్ళు బంగారు కరగించి పోసినట్లుంది. శ్రీ కాళహస్తీశ్వరుని ఆలయ గాలిగోపురం సంజ వెలుగులో ధవళ శిఖరంలా వెలిగిపోతూ వుంది. ఆ గాలిగోపురం చుట్టూ ఎగురుతున్న పావురాళ్ళు కనుల పండువుగా వున్నాయి. ఆ సమ యంలో లోకమే అందంగా వుంది.

మరలా ఒకసారి వాడివైపు చూశాను. అదే మాసిన గడ్డం. అదే చిరిగిన చొక్కా. అదే దిబ్బలాంటి తలమీద కుళ్ళాయి. అదే చెమట కంపు!....

అయితే!....ఆ సాయంసమయంలో అన్నిటికంటే నా కంటికి అందంగా కనుపిస్తున్నాడు—ఆ సత్యసంధుడు రిక్షావాడు సృష్టికే అందాన్ని సమకూరుస్తున్నాడు.

జూలై 1977, ఆంధ్రప్రభ